


sahanamvande.com

epaper.sahanamvande.com


సహనం వందే



హైదరాబాద్ | 05-10-2026 సోమవారం | సంపుటి-02 సంచిక : 163 EDITOR: ROHINI

రేవంత్‌రెడ్డితో మహేష్‌కుమార్ గౌడ్

సీఎంతోనే పెట్టుకున్న పీసీసీ అధ్యక్షుడు



- తెలంగాణకు బీసీ సీఎం ఖాయమని ధీమా
- అందుకు రేవంత్ కూడా మద్దతు ఇస్తారట
- రాహుల్ గాంధీ నినాదమే స్ఫూర్తి అని వ్యాఖ్య

రాష్ట్ర రాజకీయాల్లో ఒకే ఒక్క ప్రకటన ఇప్పుడు పెద్ద దుమారాన్నే రేపుతోంది. తెలంగాణకు త్వరలోనే ఒక బీసీ వ్యక్తి ముఖ్యమంత్రి కాబోతున్నారా? ఆదివారం టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు తెలంగాణలో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. అసలు ఆయన ఏమన్నారు? ఈ వ్యాఖ్యల వెనుక ఉన్న అసలు వ్యూహం ఏమిటి? అనేది ఇప్పుడు చూద్దాం.

- సహనం వందే, హైదరాబాద్

ఒకవైపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తాను మరో 10 ఏళ్లు సీఎం పదవిలోనే ఉంటానని చెప్తున్నారు. సరిగ్గా ఇలాంటి సమయంలోనే పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ మాత్రం తెలంగాణకు ఖచ్చితంగా బీసీ వ్యక్తే సీఎం అవుతారని చెప్పడం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ వ్యాఖ్యలకు సీఎం రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ సహకారం కూడా ఉంటుందని ఆయన అనడం విశ్లేషకులను సైతం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఇప్పటివరకు రేవంత్ రెడ్డి, మహేష్ గౌడ్ మధ్య మంచి సంబంధాలే ఉన్నప్పటికీ, ఈ వ్యాఖ్యలతో ఇద్దరి మధ్య దూరం పెరిగే అవకాశం ఉందనే టాక్ వినిపిస్తోంది. అంతేకాదు ఆయన ఏకంగా సీఎంతోనే పెట్టుకోవడం వెనుక ఆంతర్యం ఏంటనేది అర్థం కావడం లేదు.

రాహుల్ గాంధీ ఇచ్చిన ధైర్యంతోనే!

శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో మాట్లాడిన మహేష్ గౌడ్... రాహుల్ గాంధీ ఇచ్చిన ధైర్యంతోనే తాను ఈ వ్యాఖ్యలు చేస్తున్నానని కుండబద్దలు కొట్టారు. కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ఇచ్చిన ప్రోత్సాహం కూడా దీనికి ఉందన్నారు. రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రలో ఎవరి వాటా ఎంత ఉందో వారికి అంత ప్రాతినిధ్యం లభించాలనే నినాదాన్ని ఆయన గుర్తుచేశారు. ఆ మాటకే కట్టుబడి బీసీలకు రావాల్సిన న్యాయమైన వాటాను తీసుకుంటామని స్పష్టం చేశారు.

కుల సర్వేతో కొత్త చరిత్ర

రాష్ట్రంలో నిర్వహించిన కుల సర్వే గురించి కూడా ఆయన వివరంగా మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఇతర మంత్రుల సహకారంతో కుల సర్వేను విజయవంతంగా పూర్తి చేశామన్నారు. ఈ సర్వే డాక్యుమెంట్ కూడా సిద్ధమైందని, ఇది గనుక పూర్తిగా సాకారమైతే యావత్ దేశానికే తెలంగాణ ఒక రోల్ మోడల్‌గా నిలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. జనాభా ప్రాతిపదికన బీసీలకు హక్కులు కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు.

మోదీపై విమర్శలు... కాంగ్రెస్ లెక్కలు

ప్రధాని నరేంద్ర మోదీపై మహేష్ గౌడ్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం బీసీలను వంచనకు గురిచేస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలోనే బీసీలకు నిజమైన రాజకీయ ప్రాతినిధ్యం దక్కిందని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 55 శాతానికి



పైగా సర్పంచ్ పదవులను, మున్సిపల్ ఎన్నికల్లో 58 శాతం సీట్లను బీసీలకే కేటాయించామని లెక్కలతో సహా వివరించారు. రాబోయే రోజుల్లో మంత్రివర్గంలో, ఎమ్మెల్యే స్థానాల్లో, కార్పొరేషన్లలో బీసీల సంఖ్యను మరింత పెంచుతామని హామీ ఇచ్చారు.

బీసీల ఐక్యతకు పిలుపు...

కేంద్రంలో త్వరలోనే అధికారం మారుతుందని, మోదీ దిగిపోయి రాహుల్ గాంధీ ప్రధాని కావడం ఖాయమని మహేష్ గౌడ్ జోస్యం చెప్పారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే దేశవ్యాప్తంగా కుల సర్వే నిర్వహిస్తామన్నారు. బీసీ వర్గాలన్నీ చిన్న చిన్న కుల భేదాలను పక్కన పెట్టి ఏకం కావాలని, ఐక్యంగా పోరాడితేనే రాజకీయ సాధికారత సాధ్యమవుతుందని పిలుపునిచ్చారు. భవిష్యత్ తరాల బాగు కోసం ఈ పోరాటం తప్పనిసరి అని ఉద్ఘాటించారు.

దసరా దెబ్బకు బాక్సాఫీస్ బద్దలు

పండుగ రేసులో నాలుగు పెద్ద సినిమాలు

- 9న విక్టరీ వెంకటేష్ ఆదర్శకుటుంబం
- అదేరోజు శ్రీవిష్ణు కామ్రేడ్ కళ్యాణ్ సైతం
- 15న సూపర్ స్టార్ రజనీ జైలర్ ధమాకా
- 16న విజయ్ దేవరకొండ దంపతుల రణబాలి

ఈసారి దసరా పండుగ సీజన్ బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి మంట పుట్టించబోతోందో తెలుసా? ఏకంగా నాలుగు పెద్ద సినిమాలు థియేటర్లలోకి దూసుకొస్తున్నాయి. మరి ఈ రేసులో అసలు విజేత ఎవరు, దేనికి ఎక్కువ హైప్ ఉందో తెలుసుకోవాలని ఉందా? నాలుగు సినిమాలు వస్తున్నా కూడా అనుకున్నంత రేంజ్‌లో సందడి ఉందా అంటే డౌటే అనిపిస్తోంది.

- సహనం వందే, హైదరాబాద్



అందరి కంటే ముందుగా ఈ నెల 9న విక్టరీ వెంకటేష్ తన ఆదర్శకుటుంబం సినిమాతో బాక్సాఫీస్ బరిలోకి దిగుతున్నాడు. మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమాలో తనదైన స్టైలిష్ మార్క్ తో పాటు కాస్త క్రైమ్ అంశాలు కూడా కలిపారట. అయితే ఏంటో గానీ ఈ సినిమాకు ఇప్పటివరకు మార్కెట్లో సరైన సందడి మాత్రం కనిపించడం లేదు. నువ్వు నాకు నచ్చావు సినిమా స్థాయిలో దీన్ని ఉంచుకునే పరిస్థితి ఊహించుకునే పరిస్థితి లేదని సినీ విశ్లేషకులు అంటున్నారు.

కనుచూపు మేరలో లేని కామ్రేడ్...

వెంకటేష్ సినిమా వచ్చే రోజునే యంగ్ హీరో శ్రీవిష్ణు నటించిన కామ్రేడ్ కళ్యాణ్ కూడా థియేటర్లలోకి వస్తోంది. నక్సలిజం అనే చాలా తీవ్రమైన నేపథ్యానికి సరదా కామెడీని జోడించి ఈ సినిమా తీశారు. ఐతే ఈ సినిమా అసలు థియేటర్లకు వస్తున్నట్టే చాలా మందికి తెలీని పరిస్థితి నెలకొంది. శ్రీ విష్ణు కామెడీ పండితే మాత్రం సినిమాకు తిరుగుండదని అంటున్నారు.

సూపర్ స్టార్ రజనీ జైలర్ ధమాకా

ఇక పండుగ వారం మధ్యలో అంటే 15న సూపర్ స్టార్ రజనీకాంత్ తన జైలర్ 2 సినిమాతో ఊచకోత కోసేందుకు వస్తున్నాడు. గతంలో భారీ విజయం సాధించిన జైలర్‌కి ఇది రెండో భాగం. కుటుంబ కథతో పాటు విపరీతమైన యాక్షన్ థ్రిల్లర్‌గా దీనిని మలిచారు. నెల్సన్ దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమా మొదటి భాగం కంటే డబుల్ రేంజ్‌లో అలరిస్తుందని చెప్తున్నారు. దసరాకు వచ్చే నాలుగు సినిమాల్లో కాస్తో కూస్తో మంచి హైప్ ఉన్న సినిమా ఇదే అని చెప్పుకోవాలి.

విజయ్ దేవరకొండ రణబాలి సస్పెన్స్

చివరగా 16న రౌడీ హీరో విజయ్ దేవరకొండ నటించిన రణబాలి ప్రేక్షకుల ముందుకు వస్తోంది. గతంలో టాక్సీవాలా తీసిన రాహుల్ సాంకృత్యాయన్ దర్శకత్వంలో పీరియాడిక్ కథాంశంతో ఈ సినిమా రూపుదిద్దుకుంది. పెద్ద కాంబినేషన్ అయినా కూడా ఎందుకోగానీ ఈ సినిమాపై సైతం ఆశించిన స్థాయిలో అంచనాలు పెరగలేదు. భార్య భర్తలు కలిసి నటిస్తున్నప్పటికీ సినిమాకు హైప్ రాలేదని అంటున్నారు.

ఎవరిది అసలైన గెలుపు

బాక్సాఫీస్ దగ్గర నాలుగు విభిన్నమైన కథలతో వస్తున్న ఈ సినిమాల్లో ఏది హిట్ కొడుతుందో చూడాలి. ప్రేక్షకుల మదిని గెలిచి దసరా విజేతగా ఏ సినిమా నిలుస్తుందో కొద్ది రోజుల్లోనే తేలిపోనుంది. ఏది ఏమైనా పేరున్న హీరో హీరోయిన్లు, దర్శకులు ఉండటంతో ఈ సినిమాలు దసరాకు సందడి చేస్తాయని అంటున్నారు.

తాగడంలో మనోళ్లే తోపు!

తూలుతున్న తెలంగాణ... దేశంలో నెంబర్-1

- రెండో స్థానం దక్కించుకున్న మన ఆడబిడ్డలు
- పట్టణాల కంటే పల్లెల్లోనే కిక్కు చాలా ఎక్కువ
- ఇది విజయమంటారా? వినాశనం అంటారా?
- గుల్లవుతున్న కాలేయం... ఇదే అసలు నిజం



మందు తాగడంలో మన తెలంగాణోళ్లను కొట్టేటోడే లేడని మీకు తెలుసా? జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (ఎన్.ఎఫ్.హెచ్ఎస్-6) వెల్లడించిన నిజాలు చూస్తే ఎవరైనా సరే నోరెళ్లబెట్టాల్సిందే. దేశంలోనే అత్యధికంగా మద్యం సేవిస్తున్న రాష్ట్రంగా మన తెలంగాణ మొదటి స్థానంలో నిలిచి అందరినీ ఆశ్చర్యపరిచింది. - సహనం వందే, హైదరాబాద్

మన రాష్ట్రంలో 15 ఏళ్ల దాటిన మగవాళ్లలో ఏకంగా 43.9 శాతం మంది క్రమం తప్పకుండా మద్యం తాగుతున్నారు. దేశమంతటా చూస్తే ఈ సగటు కేవలం 18.9 శాతమే ఉంటే, మనోళ్లు దానికి రెండింతలకు పైగా స్కోర్ చేసి రికార్డు సృష్టించారు. ఈ పోటీలో 42.2 శాతంతో రాజస్థాన్ రెండో స్థానంలో నిలిచింది. ఆ తర్వాత ఛత్తీస్‌గఢ్ 38.3 శాతం, జార్ఖండ్ 33.6 శాతం, మధ్యప్రదేశ్ 26.9 శాతంతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

నగరాల కంటే పల్లెల్లోనే ఎక్కువ

మనం సిటీల్లోనే బార్లు, పబ్‌ల గోల ఎక్కువనుకుంటాం కానీ అసలైన కిక్కు పల్లెటూర్లలోనే ఉంది. పట్టణాల్లో 15 ఏళ్ల పైబడిన పురుషుల్లో మద్యం తాగేవారు 36.3 శాతం ఉంటే, గ్రామాల్లో అది ఏకంగా 46.6 శాతానికి చేరింది. అంటే పట్టణాల కంటే పల్లెల్లోనే మరో 10 శాతం మంది ఎక్కువగా ఈ అలవాటులో మునిగిపోయారు.

మహిళల్లోనూ దేశంలో రెండో స్థానం...

ఈ విభాగంలో ఆడవాళ్లు కూడా తక్కువేమీ కాదు. మహిళల కేటగిరీలో తెలంగాణ 7.1 శాతంతో దేశంలోనే రెండో స్థానంలో నిలిచింది. రాజస్థాన్ 19.9 శాతంతో మొదటి స్థానంలో ఉండగా, ఛత్తీస్‌గఢ్ 5.7 శాతం, జార్ఖండ్ 5.5 శాతంతో మన వెనుకే ఉన్నాయి. ఏ చిన్న సంబరమైనా, దావత్ అయినా సరే చేతిలో గ్లాస్ లేకుండా పూర్తి కాకపోవడం మన తెలంగాణ సంస్కృతిలో భాగమైపోయింది. ప్రతి వేడుకలోనూ మద్యం సీసా ఉండాల్సిందే అన్నట్లుగా పరిస్థితి మారిపోయింది.


ముందున్న ప్రమాదాలు

ఈ రికార్డు చూసి సంతోషపడాలో లేక బాధపడాలో అర్థం కావడం లేదు. కాలర్ ఎగరేసే ఈ నంబర్ల వెనుక కుటుంబాలు నాశనం కావడం, ఆరోగ్యం పాడవ్వడం లాంటి చేదు నిజాలు ఉన్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వాలు అప్రమత్తమై మద్యం అమ్మకాలపై నియంత్రణ విధించకపోతే ముందుంది పెద్ద ముప్పే ముంచుకొస్తుంది.

కేదార్‌నాథ్‌లో దేవుడే ఆశ్చర్యపోయేలా...!

భక్తులంతా ఏకమై విప్లవాత్మక ఉద్యమం

- శివ నామస్మరణతో పారిశుద్ధ్యంపై యుద్ధం
- హిమాలయ పర్వతాల్లో పునీత మహా యజ్ఞం
- టన్నుల కొద్ది చెత్తను మోసుకొచ్చిన భక్తులు
- కేదార్‌నాథ్ చరిత్రలోనే ఇది మొదటిసారి



మన కేదార్‌నాథ్ ఆలయ పరిసరాలు ఎప్పుడైనా ప్లాస్టిక్ కుప్పలతో నిండిపోయి ఉండటం చూసి గుండె చెదిరిపోయిందా? ఈసారి అక్కడ చరిత్రలోనే ఎన్నడూ చూడని ఒక అద్భుతమైన మార్పు జరిగింది. హిమాలయాల పవిత్రతను కాపాడటానికి వేలాదిమంది భక్తులు చేతులు కలిపి టన్నుల కొద్దీ చెత్తను కొండలపై నుంచి కిందకు మోసుకొచ్చారంటే నమ్మగలరా? ప్రశాంతమైన ఆ పర్వత లోయల్లో ఇప్పుడు అసలైన భక్తి రసం పరిశుభ్రత రూపంలో పొంగిపొర్లుతోంది. - సహనం వందే, కేదార్‌నాథ్

పూర్తి కథనం కోసం sahanamvande.comను సందర్శించండి